# ఎ.పి.రెవెన్యూ రికవరీ చట్టం 1864

**1.ముఖ్యోద్దేశ్యము:-**

రాష్ట్ర ప్రభుత్వానికి రావలసిన పన్నులు, ప్రభుత్వ గ్యారంటీతో బ్యాంకులు, ప్రభుత్వ సంస్థలు, కార్పోరేషన్‌లు ఇచ్చిన అప్పులు ప్రభుత్వానికి లేదా ఆయా సంస్థలకు సకాలంలో సక్రమంగా చెల్లించని సందర్భములలో బకాయి పడిన మొత్తములను ఈ చట్ట ప్రకారము వసూలు చేయవలసియుండును.

**2.వసూలు చేయగలిగిన అధికారులు సెక్షను 5 ప్రకారం:-**

ప్రభుత్వానికి బకాయి పడ్డ భూమి శిస్తు, నీటి తీర్వా లేదా శిస్తులాగానే వసూలు చేయదగిన బకాయిలను వసూలు చేసే అధికారం జిల్లా కలెక్టరుకు లేదా ఆయన అనుమతి పొందిన అధికారులకు ఉంటుంది.

**3.బకాయి సొమ్ము వసూలు విధానము:-**

రెవెన్యూ రికవరీ చట్ట ప్రకారం ఏ భూమిపై పన్ను బకాయి వుందో ఆ భూమి అందుపైగల కట్టడములు బకాయికి హామీగా ఉంటాయి. (సెక్షన్-2) భూస్వామి తాను చెల్లించవలసిన పన్ను కిస్తీ సమయములో విధిగా చెల్లించాలి. (సెక్షన్-3) కిస్తీ సమయములో చెల్లించ నట్టి సొమ్ము ల్యాండు రెవెన్యూ బకాయిగా పరిగణింపబడుతుంది (సెక్షన్-4) బకాయిదారుకు, ఫారం-I డిమాండు నోటీసులో బకాయి సొమ్ము బకాయి పడిన తేదీ తెలియజేస్తూ డిమాండు నోటీసు జారీ చేయాలి (సెక్షన్-8)

**4.జప్తు:-**

డిమాండు నోటీసుకు బకాయిదారు స్పందించకపోతే, బకాయి, అందుపై జప్తు ఖర్చులు, బేటా, మొత్తము రాబట్టుటకు అవసరమైనంత చరాస్తిని ( Euqual to the arrears) లేదా స్థిరాస్తిని మాత్రమే (సెక్షన్-14) జప్తు చేయాలి. స్థిరాస్థులున్నను, చరాస్తులు జప్తు చేయుటకే మొగ్గుచూపాలి.

**5.జప్తు చేయు విధానము:-**

సూర్యోదయం తరువాత సూర్యాస్తమయమునకు ముందు మాత్రమే జప్తు చేయాలి. (సెక్షన్-15) జప్తుచేయుటకు వీలు లేకుండ బకాయిదారు చరాస్తిని వేరొకచోటకు తరలిస్తే సెక్షన్ 424 ఐ.పి.సి ప్రకారం బకాయి దారు శిక్షార్హుడౌతాడు (సెక్షన్.16) జప్తు చేసిన ఆస్తిని బకాయిదారు దౌర్జన్యముగా జప్తు చేసిన అధికారి ఆధీనము నుండి తప్పించినచో సివిల్ కోర్టు ద్వారా జప్తు ఆస్తిని జప్తు చేసిన అధికారి పొందాలి. ఈ నేరమునకు బకాయి దారు ఐ.పి.సి లో గల శిక్షకు గురికావచ్చును. (సెక్షను.18) సెక్షన్ 19,20 మరియు 21 ప్రకారం జప్తు చేయు అధికారి బకాయిదారు పశువులశాల, గాదె, గోడౌను, వెలుపలి తలుపులు తెరిచియున్న నివాస గృహములోనికి ప్రవేశించి బకాయిదారు చరాస్థులు జప్తు చేయవచ్చును. ఘోషా స్త్రీలు నివశించే గదులలోనికి ప్రవేశించరాదు. తలుపులు తెరిచి లేని గృహంలో ప్రవేశించాలన్నా, లేదా ఘోషా స్త్రీలు ఉండే గదిలో బకాయిదారు ఆస్తులు ఉన్నట్లు రూఢిగా తెలిసినా, పోలీసు వారి సహాయంతో తలుపులు తెరచి, ఘోషా స్త్రీలను వారు ఉంటున్న గది నుండి తప్పుకోవలసినదిగా కోరి, వారు తప్పుకున్న తర్వాత బకాయి దారు చరాస్తిని జప్తుచేసి, స్వాధీన పర్చుకోవాలి. ఘోషాస్త్రీలు ఉండగా ప్రవేశించే అధికారి సెక్షన్ 21 ప్రకారం రూ.500/-లు జరిమానా లేదా 6 మాసముల వరకు కారాగార శిక్షకు పాత్రులవుతారు.

**6.చరాస్తి జప్తు, వేలం విధానము:-**

సెక్షన్ 8 ప్రకారము జారీ చేసిన ఫారం I నందలి నోటీసులో తెల్పిన వడ్డీతో బకాయి, బేటా చెల్లించుటకు స్పందించకపోతే బకాయి దారు చరాస్తిని సెక్షన్ 9 ప్రకారము జప్తుచేసి ఫారం II లో జప్తు నోటీసులో జప్తుచేయబడిన చరాస్థి వివరాల, అంచనా విలువ తెలియ పరుస్తూ బకాయిదారు పై ఒక ప్రతి అమలు జరపాలి. జప్తు ఆస్తిని జప్తు చేయు అధికారి స్వాధీన పర్చుకోవాలి. ఆవిధంగా చరాస్తి జప్తు చేసినా బకాయి, జప్తు ఖర్చులు చెల్లించి జప్తు ఆస్తి విడుదల పొందుటకు బకాయిదారు స్పందించకపోతే అమలు జరిపిన డిమాండ్ నోటీసు (ఫామ్-I) మరియు జప్తు నోటీసు (ఫామ్-II) జతచేసి తహశీల్దారు గారికి పంపించాలి. తహశీల్దారు సెక్షన్ 22 ప్రకారం ఫామ్-III వేలం నోటీసులో జప్తు చేయబడిన చరాస్తి వివరములు, వేలం వేయుటకు నియమించిన అధికారి, వేలంవేయు స్థలము, తేదీ సమయము నిర్ణయిస్తూ నోటీసు జారీ చేస్తారు. నోటీసు ప్రచురించిన 15 రోజుల తరువాత మాత్రమే వేలం నిర్వహించాలి. కాబట్టి వేలం నోటీసులో తేదీ, సమయం నిర్ణయించుటలో తహశీల్దారు జాగ్రత్తవహించాలి. వేలంనోటీసు ప్రతులు బకాయిదారుపై అమలు జరిపి, గ్రామ పంచాయితీ నోటీసు బోర్డులో ప్రకటించి, అందలి వివరములు దండోరామూలముగా గ్రామస్తులకు తెలియజేయాలి. సెక్షన్ 10 ప్రకారం వేలం తేదీకి ముందు రోజు సాయంత్రం 5 గంటలలోగా బకాయిదారు బకాయి, జప్తు ఖర్చులు పూర్తిగా చెల్లిస్తే, జప్తు ఆస్తిని విడుదల చేయాలి. కానిచో వేలం తేదీన, వేలం అధికారి జప్తు ఆస్తిని వేలం వేసి హెచ్చు పాటదారు నుండి వేలం సొమ్ము వసూలుచేసి, జప్తు ఆస్తిని హెచ్చు పాటదారుకు అప్పగించాలి. వడ్డీతో బకాయి, జప్తు ఖర్చులు రికవరు చేసుకోగా, మిగిలిన సొమ్ము బకాయి దారుకు చెల్లించి రశీదు పొందాలి. (సెక్షన్.23) ఏ కారణముచేతనైనా హెచ్చు పాటదారు పాటసోమ్ము పూర్తిగా నిర్ణీత గడువులోగా చెల్లించనిచో, జప్తు ఆస్తి అప్పగించకుండా, తిరిగి పాటపెట్టినచో సంభవించు నష్టమునకు ముందు హెచ్చు పాటదారు, నష్ట పోయిన సొమ్ము చెల్లించుటకు బాధ్యుడగును. (సెక్షన్24)

**7.స్థిరాస్తి జప్తు వేలం విధానము:-**

బకాయి దారువద్ద జప్తు చేయదగు చరాస్తి లేకున్నా లేదా బాకీ రాబట్టుటకు సరిపడు చరాస్తి లేకున్నా, జప్తు చేసిన చరాస్తి వల్ల బకాయి, జప్తు ఖర్చులు పూర్తిగా వసూలు కాకున్నా, రాబట్టవలసిన బకాయికి సరిపడు బకాయిదారు స్థిరాస్తిని జప్తుచేయవలసి ఉంటుంది.

సెక్షన్ 25 ప్రకారం ఫారం 4 లో తహశీల్దారు వారు బకాయి దారుకు అతను బకాయి పడిన బాకీ, వడ్డీ, ప్రోసెస్ ఖర్చులు తెలియజేస్తూ, నిర్ణయించిన గడువులోగా చెల్లించనిచో స్థిరాస్తి

జప్తుకు చర్య తీసుకోబడునని తెలియజేస్తూ డిమాండు నోటీసు జారీచేసి, బకాయి దారుపై అమలుజరపాలి.

సెక్షన్ 26 మరియు 27 ప్రకారం బకాయిదారు పై డిమాండు నోటీసుకు స్పందించకపోతే, ఫారం 5 లో బకాయి దారు భూమి లేదా అందలి భాగం (సబ్ డివిజను చేయబడాలి) వివరములు, హద్దులు పొందుపరచి, భూమి జప్తుచేస్తూ జప్తు నోటీసు, జప్తుచేయబడిన భూమిలో ప్రకటించాలి, బకాయి దారుపై అమలు జరపాలి. జిల్లా గెజిట్‌లో ప్రకటన చేయించాలి. ప్రకటించిన తరువాత జప్తు చేయబడిన భూమి ప్రభుత్వాధీనములో ఉంటుంది. సెక్షన్ 28 ప్రకారం జప్తుకాబడిన భూమిని మేనేజి చేయుటకు పారం 6 లో ఏజెంటును నియమించాలి. సెక్షన్ 30 ప్రకారం మేనేజి చేయు జప్తు ఆస్తికి సంబంధించిన ఆదాయములు అద్దెలు శిస్తులు వసూలుచేయడం, లేదా అవసరమైన ఖర్చులు పెట్టి సక్రమమైన జమాఖర్చులు వ్రాయాలి. బకాయి దారు జమా ఖర్చులు పరిశీలించుకొనే హక్కు కలిగి ఉంటారు. సెక్షన్ 34 ప్రకారం ఏజెంటు జప్తు కాబడిన భూములపై వసూలైన అద్దెలు, శిస్తులలో మెయింటెనెన్సు ఖర్చులు పోగా, మిగిలిన ఆదాయం బకాయిదారు నుండి రాబట్టవలసిన బకాయి, జప్తు ఖర్చులకు పూర్తిగా సరిపోయినచో, భూమిని జప్తు నుండి రిలీజ్ చేయవచ్చును. ఏజెంటును విత్‌డ్రాచేయవచ్చును. సెక్షన్-35 ప్రకారం జప్తు చేయబడిన భూమిలో ఇంటరెష్టు, గల ఏవ్యక్తియైనను, బకాయి, జప్తు ఖర్చులు, మేనేజ్‌మెంటు ఖర్చులు పూర్తిగా చెల్లించి, జప్తు నుండి భూమిని విడుదల పొందవచ్చును.

సెక్షన్ 36 ప్రకారం:- జప్తు చేసిన స్థిరాస్తిని వేలం వేయుటకు తగిన స్థలము, సమయమును వేలం నోటిఫికేషను జారీకాబడి ప్రచురింపబడిన నెల తరువాత తేదీని ముందుగా నిర్ధారణచేసుకొని ఫారం 7 భూమి జప్తు నోటిఫికేషనులో డిఫాల్టరు వివరములు, వేలంచేయబడు భూమి వివరములు, విస్తీర్ణము, హద్దులు, బకాయి దారునుండి రాబట్టవలసిన బాకీ, వేలంవేయు అధికారి వివరములు, వేలం వేయు స్థలము, తేదీ, సమయము తెలియజేస్తూ నోటిఫికేషను జారీ చేయాలి. అట్టి నోటీసు వేలం తేదీకి ఒక నెల ముందుగానే కలెక్టరు కార్యాలయంలోను, తహశీల్దారు కార్యాలయంలోను, పోలీసు స్టేషనులోను, జప్తు కాబడిన భూమిలోను ప్రకటించాలి. వేలం గురించి బహుళ ప్రచారం జరిగేలా దండోరా మూలముగా ప్రకటించాలి. వేలం రోజున హెచ్చు పాటదారు పాటసొమ్ములో 15% సొమ్ము చెల్లించి, మిగతా 85% ముప్పై రోజులలోగా చెల్లించాలి. లేనిచో 15% డిపోజిట్టు సోమ్ము కొల్పోవలసి ఉంటుంది. హెచ్చు పాటదారు మిగతా 85% సొమ్ము చెల్లించని కారణముగా అదే భూమి మరల వేలం వేయవలసివస్తే, అట్టి వేలంవల్ల వచ్చే నష్టమునకు మొదటి హెచ్చు పాట దారే బాధ్యుడౌతాడు. నష్టపోయిన సొమ్మును అతని నుండి ల్యాండు రెవెన్యూ బకాయిగా వసూలు చేయవలసి ఉంటుంది.

స్థిరాస్తి వేలం తేదీకి ముందు రోజు సూర్యాస్తమయానికి ముందు, బకాయి, జప్తు ఖర్చులు, మేనేజిమెంటు ఖర్చులు, వేలానికి తీసుకురావడానికి అయిన ఖర్చులతో కలిసిన మొత్తం బకాయి దారుగాని, అతని తరపునగాని, తణఖాదారుగాని, కౌలు దారుగాని చెల్లించినచో వేలం నిలిపివేయవచ్చు.

సెక్షన్ 37– ఎ ప్రకారం: వేలంవేయబడిన తరువాత భూమిపై హక్కులు గల బకాయిదారు, తణఖాదారులలో ఎవరైన వేలం నిర్వహించిన 30 రోజులలోగా వేలం సొమ్ములో 5% న్యూ, బకాయి, జప్తు, మేనేజిమెంటు, వేలం ఖర్చులు యావత్తు మొత్తం ట్రజరీలో డిపోజిట్టుచేసి, వేలం ఖాయపర్చకుండ, రద్దు పరచవలసినదిగా కోరుచూ అర్జీతో చలానా జతపర్చాలి. చలానా దాఖలా సొమ్మును హెచ్చు పాటదారుకు రిఫండ్ చేస్తూ, వేలం రద్దు పర్చాలి.

సెక్షన్ – 38 ప్రకారము: వేలం వేసిన 30 రోజుల అనంతరం హెచ్చు పాట దారు పేర్న వేలం ఖాయపర్చి హెచ్చు పాట దారుకు ఫారం 8 లో వేలం సర్టిఫికెట్టు మంజూరు చేయాలి.

సెక్షన్ – 39 హెచ్చు పాటదారునికి సేలు సర్టి ఫికెట్టు యిచ్చిన తరువాత వివరములు జిల్లా గెజిట్‌లో అతడు వేలంలో కొనుక్కున్నట్లు, అతనికి కొన్న భూమిపై అన్ని హక్కులు సంక్రమించినట్లు ప్రచురించాలి. కలెక్టరు కార్యాలయంలోను, తహశీల్దారు కార్యాలయంలోను, గ్రామంలోను ఎల్లరకు తెలియులాగున ప్రకటనచేయించాలి.

సెక్షన్ 40 ప్రకారం – వేలంలో కొన్న భూమితో వేలంపాట దారుకు సేలు సర్టిఫికెట్ ఆధారముగా ప్రవేశింపచేయాలి. వేలంపాట దారుకు స్వాధీనం కాకపోతే లేదా అతనిని స్వాధీనం పొందకుండ అటకాయిస్తే కోర్టు ద్వారా స్వాధీనం పొందవచ్చును.

**8.బకాయి దార్ల నిర్బంధము:**

సెక్షన్ 48 ప్రకారం భూమి వేలం వేసినా, బకాయి, జప్తు ఖర్చులు, మేనేజి మెంటు ఖర్చులు, వేలం ఖర్చుల మొత్తం, వేలం వల్లరాకపోతే, బకాయిదారు, అతని హామీ దారులు ఉద్దేశ పూర్వకంగా చెల్లించుటకు నిరాకరించినా, కాలయాపన చేసినా, అట్టిబకాయి దారు అతని హామీదార్లకు రూ 500/ – లు మించినచో 2 సంవత్సరముల వరకు, రూ.50/– మించనిచో 3 నెలల కారాగార శిక్ష విధించవచ్చును.

**9.భూమి శిస్తు కాకుండా రాష్ట్ర ప్రభుత్వమునకు చెందిన మిగిలిన బకాయిల వసూలు:**

భూమి శిస్తు కాకుండా రాష్ట్ర ప్రభుత్వమునకు చెందిన యితర బకాయిలు అనగా వ్యవసాయమునకు సంబంధించిన అడ్వాన్సులు, సెస్సులు, కాంట్రాక్టు ఉల్లంఘన వలన జరిగిన నష్టములు, మరియు యితర రెవెన్యూ బకాయిలు కూడా యీ చట్టమునందలి 52వ సెక్షను ప్రకారం వసూలు చేయవచ్చును.

**10. బ్యాంకులు, యితర పబ్లిక్ సంస్థలకు రావలసిన బకాయిల వసూలు:**

సెక్షన్ 52–ఎ ప్రకారము – ప్రభుత్వము గ్యారంటీగల బ్యాంకు రుణాలు, సంక్షేమ కార్యక్రమాల క్రింద మంజూరు చేసిన బ్యాంకు రుణాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలోని కార్పోరేషన్ల బాకీలు, ప్రధాన మంత్రి రోజ్‌గార్ యోజన వగైరా బకాయిలు వసూలు చేయవలసి ఉంటుంది.

# ప్రకృతి వైపరీత్యాలలో, గ్రామ రెవెన్యూ అధికారి చేపట్టవలసిన చర్యలు

ప్రకృతి వైపరీత్యాలు సంభంవించినప్పుడు ప్రాణాలను, జీవరాశులను, ఆస్తిని కాపాడు కొనేలా గ్రామం తన స్వంత అత్యవసర ప్రణాళిక తయారు చేసుకోవటంలో కొన్ని మార్గదర్శక సూత్రాలను ఇవ్వటం చాలా అవసరం. గ్రామ రెవెన్యూ అధికారి ఈ పనుల్లో ఇతరుల సహాయంతో చాలా చురుకుగా చేయగలడు.

**గ్రామ అత్యవసర ప్రణాళిక అంటే ఏమిటి?**

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఆస్తినష్టం, జీవరాశుల నష్టం, ప్రాణనష్టం తగ్గించటానికి తీసుకోవలసిన చర్యలజాబితాను గ్రామ అత్యవసర ప్రణాళిక అంటారు.

ఆ గ్రామం ప్రజలు, భౌగోళిక పరిస్థితులు, వనరులు, కలిసి నిర్ణయం తీసుకునే విధానాలు ఒక్కోగ్రామానికి ఒక్కోరకంగా ఉంటాయి. కాబట్టి గ్రామ అత్యవసర ప్రణాళిక ఒక్కొక్క గ్రామానికి ఒక్కొక్క రకంగా ఉంటుంది.

పొలాలను, ఇళ్ళను ముంపునకు గురి చెయ్యగల చెరువులు, కాలువలు, మొదలైన వాటిని గుర్తించాలి. గత అనుభవాల ఆధారంగా ఏ ప్రాంతం వరదకు గురవుతుందో ప్రజల చెప్పగలుగుతారు. ఇటువంటి ప్రాంతంలో మట్టి ఇళ్ళు నష్టానికి గురవుతాయి. అటువంటి ప్రదేశములను గుర్తించాలి.

ఈ జాబితా ఆధారంగా గ్రామస్తులు తమ ఊరిలో భౌగోళికంగా బలహీన ప్రాంతాలు ఏవి, పల్లపు నివాస ప్రాంతాలు వాటివల్ల ఎవరు నష్టపోతారో, ఏమి నష్టపోతారో గుర్తించ గలుగుతారు. వీటిని 4వ దశలో ప్రస్తుతిస్తాము. ఈ బలహీనతలను సరిదిద్దటం పై అత్యవసర ప్రణాళిక ఎంతగానో ఆధారపడుతుంది.

అత్యంత నష్టానికి గురయ్యే ప్రజలెవరో, ప్రాంతాలేవో గుర్తించి వాళ్ళని రక్షించటానికి ఏమి చేయ్యాలో నిర్ణయించటం ఆ తరువాతి దశ.

గతంలో సంభవించిన తుఫానుల అనుభవం ఆధారంగా ఎవరు ఎక్కువ నష్టానికి గురి అయ్యే అవకాశం ఉందో గ్రామ ప్రజలు గుర్తిస్తారు. ఎవరు నష్టానికి గురవుతారు. ఏమి నష్టానికి గురవుతాయి. అన్న జాబితా తయారు చేసి వాటిని మీద గుర్తించాలి. ఉదాహరణకు

| ఎవరు నష్టానికి గురవుతారు | ఎవరు నష్టానికి గురవుతారు |
|---|---|
| ➢ వృద్ధులు, వికలాంగులు | ➢ పశువులు |
| ➢ పిల్లలు, గర్భిణీ స్త్రీలు | ➢ ఇంటిలో విలువైన వస్తువులు |
| ➢ జబ్బు పడ్డ వాళ్ళు | ➢ ఇళ్ళు, బలహీన నిర్మణాలు |
| ➢ వంటరి మహిళలు | ➢ పడవలు, వలలు, ఎండు చేప నిల్వలు |
| ➢ సముద్రానికి దగ్గరా నివసిస్తున్న కుటుంబాలు | ➢ మోటారు పంపులు, ఇతర సదుపాయాలు |
| ➢ పూరిళ్ళల్లో ఉంటున్న కుటుంబాలు | ➢ మగ్గాలు ఇతర ఆస్తులు |
| ➢ సముద్రంలోకి వెళ్ళిన బెస్తవారు | ➢ పంటలు, పండ్ల చెట్లు, తోటలు |
| ➢ ఇటువంటి ఇతర బృందాలు | ➢ గ్రామ మంచినీటి వనరులు |

ముందు జాగ్రత్త చర్యలు, అత్యవసర పనులు చేపట్టటానికి కావలసిన నిధులు ఎక్కడ నుండి వస్తాయి? ఉదాహరణకు

1. తూర్పు గోదావరి జిల్లాలోని శివకృష్ణ పల్లి అన్న గ్రామంలో ప్రతి కుటుంబం వంద రూపాయల చందా వేసుకుంది. ఈ నిధులతో తుఫానుల కాలానికి ముందే గ్రామానికి అవసరమయ్యే ధాన్యం, ఇందనం, బ్లీచింగ్ పౌడరు, అత్యవసర మందులు వంటివి కొని ఉంచుతారు.
2. తుఫాను కాలం రావటానికి ముందుగానే తుఫాను షెల్టర్ల నిర్మాణం, మరమ్మత్తులకు, గాలిని నిరోధించే చెట్లు నాటటం వంటి పనులను ప్రభుత్వం చేపడుతుంది, లేదా నిధులు కేటాయిస్తుంది. ఈ పనులు జరిగేలా చూడాలి.

- అత్యవసర ప్రణాళిక పనులను అమలు చేయగల, పర్యవేక్షించగల ఉత్సాహపూరిత, బాధ్యతాయుత పురుషులు, స్త్రీలు, యువవాలంటీర్లు కార్యకర్తల ను గుర్తించాలి. **ఉదాహరణకు** – గ్రామ యువజన సంఘాల సభ్యులు, స్వయం సహాయక బృందాల మహిళా సభ్యులు, చదువుకున్నవారు, టీచర్లు వంటి వారు, కార్యకర్తలను గుర్తించిన తరువాత వాళ్ళు నెరవేర్చవలసిన బాధ్యతలలో శిక్షణ నివ్వాలి.
- నష్టాల పటం తయారు చేసే సమయంలో ఆస్తినష్టం, ప్రాణనష్టం తగ్గించటానికి గుర్తించిన ముందు జాగ్రత్త చర్యలు.

## ప్రణాళికను ఎప్పుడు, ఎవరు అమలు చేస్తారు

## (పని చేసే బృందాలు)

అయిదవ దశలో అవకాశాల పట్టిక తయారు చేస్తున్నప్పుడు గ్రామస్తులు తమలో నుంచి ఉత్సాహం, బాధ్యత గల పురుషులు, స్త్రీలు యువతను అత్యవసర ప్రణాళిక అమలు చేయటానికీ, గుర్తిస్తారు. ఉదాహరణకు – యువజన సంఘాల సభ్యులు, గ్రామ స్వయం సహాయక బృందాల మహిళా సభ్యులు, చదువుకున్న యువత, పాఠశాల టీచర్లు, మొదలైనవారు.

గ్రామ విస్తీర్ణాన్ని బట్టి, అప్పచేప్పే బాధ్యతను బట్టి ఎంపిక చేసిన 5–10 సభ్యులు గల చిన్న కార్యాచరణ బృందాలుగా చేస్తారు. ప్రతి బృందం తమకు ఇచ్చిన బాధ్యతలను ఉదాహరణకు హెచ్చరిక, సహాయం వంటి పనులను అమలు చేయాలి.

ఈ బృందాల నాయకులు అంతా కలసి ఒక సమన్వయ సంఘంగా ఏర్పడతారు. బృందం సభ్యులంతా కలసి తాము చేయాల్సిన పనులను నిర్ణయిస్తారు. సమన్వయ సంఘం బృందాల పనులను పర్యవేక్షిస్తుంది, తుఫాను ముప్పును ఎదుర్కోటానికి గ్రామం తయారుగా ఉండేలా చూస్తుంది.

ఏ కార్యాచరణ బృందాలు ఉండాలో, వాటి బాధ్యతలు ఏమిటో ప్రతి గ్రామం నిర్ణయించుకోవాలి. అయితే ప్రతి బృందానికి తుఫానుకు ముందు, తుఫాను సమయంలో ఆ తరువాత చేపట్టవలసిన ప్రత్యేక బాధ్యతలు ఉంటాయి.

**తుఫానుకు ముందు:** తుఫానుల కాలానికి అంటే ఏప్రిల్ – మే, అక్టోబర్ – డిసింబర్‌కు కొన్ని వారాల

ముందే తుఫానును ఎదుర్కోటానికి తీసుకోవలసిన చర్యలు తీసుకోవాలి. అన్ని బృందాలు తుఫాను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి.

**తుఫాను సమయంలో:** తుఫాను తాకబోయేటప్పుడు, అంటే హెచ్చరిక లభించగానే లేదా తుఫాను సమయంలో తీసుకోవలసిన చర్యలు. తుఫాను హెచ్చరిక వినగానే, తుఫాను సమయంలోనూ ప్రజలను, వారి వస్తువులను అవసరమైనపుడు సురక్షిత ప్రాంతాలకు తరలించాలి.

**తుఫాను తరువాత:** తుఫాను తాకిడికి నిలదొక్కుకుని, తిరిగి కోలుకునే చర్యలు.

**కొన్ని కార్యాచరణ బృందాల ఉదాహరణలు ఇక్కడ ఇచ్చాం**

**తుఫాను హెచ్చరిక బృందం:**

గ్రామంలోని 17–25 సంవత్సరాల యువతీ యువకులు ఈ బృందంలో సభ్యులుగా ఉండవచ్చు. రేడియో హెచ్చరికలను అర్థం చేసుకోవటంలోనూ, సమాచారాన్ని వేగంగా గ్రామ మంతటికీ చేరవేయటంలోనూ వీరికి శిక్షణ నిస్తారు.

**షెల్టరు యాజమాన్య బృందం:**

ఈ బృందంలో మహిళా సభ్యులు ఎక్కువగా ఉండవచ్చు. వాళ్ళు షెల్టర్లలో, పక్కా ఇళ్ళలో ఉంటూ తరలించబడిన వారి ఆహారం, నీరు, మందులు మొదలయిన అత్యవసర బాధ్యతలను చేపడతారు.

**తరలింపు రక్షక బృందం:**

ఈ బృందంలోని సభ్యులు బలంగా 20–35 సంవత్సరాల మధ్య ఉండాలి. వీరికి తరలింపు, రక్షణ పద్ధతుల్లో శిక్షణ నివ్వాలి.

**ప్రథమ చికిత్స వైద్య సహాయ బృందం**

ఈ బృందంలో స్త్రీ, పురుషులు సమాన సంఖ్యలో ఉండాలి. ప్రథమ చికిత్స గురించి అవగాహన ఉన్నవారికి, నర్సింగ్‌లో శిక్షణ పొందినవారికి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రథమ చికిత్సకీ వైద్య సహాయానికి పనికి వచ్చేలా బృందానికి పూర్తి శిక్షణ ఇవ్వాలి.

**పారిశుద్ధ్య బృందం:**

షెల్టర్లలోపల, బయట పారిశుద్ధ్య బాధ్యతలను స్త్రీ, పురుషులు ఉన్న బృందాలు చేపట్టాలి.

**సహాయ (రిలీఫ్) బృందం:**

ఇతర బృందాలన్నింటికి కావలసిన సహాయ, అవసరాలు – ఆహారం, పాత్రలు, బట్టలు, కిరోసిన్, డీజిల్ మొదలైనవి ఈ బృంద సభ్యులు సేకరించి, సరఫరా చేసి, సమన్వయ పరచాలి. గ్రామానికి సరిపోయేటంత మోతాదులో వస్తువులు సకాలంలో సరఫరా కావటానికి బృందంలోని స్త్రీ, పురుష సభ్యులు స్థానిక అధికారులతో మాట్లాడ గలిగి ఉండాలి.

**ఇతర బృందాలు:**

గ్రామ ప్రజలు తమ అవసరాలు, సమస్యల ఆధారంగా ఇతర బృందాలను కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. ఉదాహరణకు

- పహరా లేదా గస్తీ బృందం: ఇళ్ళు వదిలి పెట్టి వెళ్ళిన వారి ఆస్తులను కాపాడుతుంది.
- ప్రభుత్వం, ప్రజల మధ్య సమన్వయ బృందం: గ్రామంలో తీసుకున్న ముందు జాగ్రత్త చర్యలు స్థానిక అధికారులకు తెలియ చేసి ప్రజల అవసరాలను వారికి తెలియ చేస్తుంది. గ్రామానికి అవసరమయ్యే మరమ్మత్తులు, ముందు జాగ్రత్తకు కావలసిన నిర్మాణాల కోసం దరఖాస్తూలు వంటివి పూర్తి చేయటంలో సహాయ పడుతుంది.

**వ్యక్తులు, కుటుంబాల బాధ్యతలు:**

తుఫానును గ్రామం ఒక పద్ధతి ప్రకారం ఎదుర్కోవాలంటే వ్యక్తులు, వారి కుటుంబాలు తమకై తాముకొన్ని బాధ్యతలు చేపట్టటానికి సిద్ధం కావాలి.

తుఫాను రావటానికి కొన్ని నెలల ముందే కార్యాచరణ బృంద సభ్యులు మిగిలిన గ్రామస్తులతో సమావేశం జరపాలి. ఇందులో

- అత్యవసర కార్యక్రమాలను అమలు చేయటంలో వారి సహాయాన్ని కోరాలి.
- వివిధ కార్యాచణ బృందాలు ఏమి చేయవలెనో చెప్పి వ్యక్తులుగా కుటుంబాలుగా వాళ్ళు ఏమి చేయాలో చెప్పాలి.

ఉదాహరణకు: కుటుంబాలు చేయవలసిన పనులు

**తుఫానుకు ముందు:**

- తుఫానుకు తట్టుకోగల ఇళ్ళ నిర్మాణానికి ప్రణాళిక తయారు చేసుకోవాలి, ఉన్న ఇళ్ళకు కప్పులను బలోపేతం చేసుకోవాలి.
- తుఫాను సమయంలో ఆధారపడటానికి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను తయారు చేసుకోవాలి.
- పక్కా ఇళ్ళు ఉన్న వాళ్ళ దగ్గర తమ విలువైన సామానులను దాచి ఉంచే ఏర్పాట్లు చేసుకోవాలి.
- కుటుంబంలోని మిగిలిన వాళ్ళకోసం చూడకుండా ఎవరికి వాళ్ళు షెల్టర్లకు చేరుకునేల ఏ షెల్టర్‌కు చేరుకోవాలో, ఏ మార్గంలో చేరుకోవాలో కుటుంబ సభ్యులందరికీ చెప్పాలి.
- ఆదాయాన్ని ఇవ్వని పశువులను అమ్మివేయాలి.

**తుఫాను సమయంలో (తుఫాను హెచ్చరిక అందిన తరువాత):**

1. ఇంటి కప్పులకు మేకులు దిగ కొట్టాలి, ఖాళీలుంటే సరిచేయాలి.
2. తుఫాను షెల్టరుకు వెళ్ళే మార్గం ఒక్కసారి చూసుకోవాలి.

3. ఇంటిలో వదులుగా ఉండే చెక్క ముక్కలు, కట్టెపుల్లలు, లేకుండా చూడాలి. ఇవి గాలికి ఎగిరిపోయే ప్రమాదానికి కారణమవుతాయి.

4. వరద కట్టలలో గండ్లు ఉన్నాయేమో చూసి సరిచేయాలి. లేకపోతే వాటి నుండి వరద నీళ్ళు లోపలికి వస్తాయి.

5. విలువైన వస్తువులను ప్లాస్టిక్ కాగితంలో చుట్టి దగ్గరలోనున్న పక్కా ఇళ్ళకు తరలించాలి. ఉదాహరణకు విత్తనం బస్తాలు, ఎరువుల బస్తాలు, ధాన్యం బస్తాలు, ఎండు చేపలు నిల్వలు.

6. పడవలు, వలలు, మగ్గాలు పంపుసెట్లు వంటి వ్యక్తిగత ఆస్తులు నష్టపోకుండా గట్టిగా కట్టివేయాలి. భద్రపరచాలి.

7. వస్తువులు, ఆస్తుల జాబితాను తయారు చేయాలి. దీనిని ప్లాస్టిక్ సంచిలో పెడితే తడవకుండా ఉంటుంది.

8. పశువులను మెట్ట ప్రదేశాలకు తరిలించి వాటికి తగినంత మేత ఉండేలా చూడాలి.

9. అధికారులెవరూ వ్యక్తిగతంగా సమాచారం అందించకపోయినప్పటికీ రేడియో పై ఆధారపడాలి.

10. కుటుంబానికి రెండు - మూడు రోజులు సరిపోయేలా నిల్వ ఉండే ఆహారాన్ని (గోధుమపిండి, మరమరాలు బెల్లం) కట్టుకోవాలి. నీళ్ళు, వస్తువులు తీసుకెళ్ళటానికి జెర్రి (ప్లాస్టిక్) క్యాన్లు, ప్లాస్టిక్ సంచులు సేకరించాలి.

11. నీటిని శుద్ధిపరిచే బిళ్ళలు, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు, నీళ్ళు అవసరమయిన వస్తువులు, మందులు తీసుకెళ్ళాలి.

12. లాంతరు, అగ్గి పెట్టెలు, టార్చిలైటు వంటివి అందుబాటులో ఉంచుకోవాలి.

13. కుటుంబ సభ్యులు ఎక్కడున్నారో తెలుసుకుని తుఫాను వస్తే రక్షిత ప్రాంతానికి వెళ్ళటానికి తయారు కావాలి.

14. సమయానికి షెల్టరుకు వెళ్లటానికి సిద్ధంకావాలి. ఆలస్యం చేయవద్దు.

15. వాతావరణం తీవ్రంగా మారిన తరువాత లోపల ఉంటే బయటకు కదల వద్దు. పడిపోతున్న వాటివల్ల, గాలికి ఎగిరివస్తున్న వాటి వల్ల గాయాలు కావచ్చు. వరదలో కొట్టుకుపోవచ్చు.

16. మీ కుటుంబానికి వేరేగా వండుకోవడం కాకుండా సామూహిక వంట ఏర్పాట్లను ఉపయోగించుకోవాలి. దీని వల్ల పొగతగ్గటమే కాకుండా కట్టెపుల్లలు ఆదా అవుతాయి.

17. పుకార్లను ఎట్టి పరిస్థితులలోనూ నమ్మవద్దు. దీని వల్ల ప్రజలు అనవసరంగా భయాందోళనలకు గురవుతారు.

18. పక్కా ఇళ్ళల్లో పై అంతస్తులో ఉండేవారు క్రింది అంతస్తుకు మారాలి.

**తుఫాను తరువాత (తుఫాను తీరాన్ని దాటిన తరువాత):**

- కార్యాచరణ బృందాల సూచనలను పాటించాలి.
- సామూహిక వంటలో సహాయం, పారిశుద్ధ్యం పాటించడం, తప్పిపోయినవారి జాడకనుక్కోవటం వంటి పనులకు ముందుకు రావాలి.
- తాగునీటిని ఎలా శుద్ధి పరుచుకోవాలో తెలుసుకోవాలి.
- వ్యక్తిగత పారిశుద్ధ్యాన్ని పాటించాలి. కుటుంబ సభ్యులు పారిశుద్ధ్య సౌకర్యాలు ఉపమోగించేలా చూడాలి.
- కుటుంబ అవసరాలు, సమస్యలను శిబిర నిర్వాహకులకు చెప్పాలి.
- పరిష్కారాలు కనుక్కోటానికి చొరవ తీసుకొవాలి.
- తప్పిపోయిన వారి వివరాలు, ఎక్కడ తప్పిపోయి ఉండవచ్చో సంబంధిత అధికారులకు తెలియ చేస్తూ ఉండాలి.
- ప్రజలు చిక్కుకుపోయి ఉండటానికి అవకాశం గల ప్రదేశాలను రక్షణ బృందాలకు చూపించాలి. తప్పిపోయినవారు, వారిని ఆఖరుగా చూసిన ప్రాంతాలు తెలియచేయాలి.
- పడిపోయినచెట్లు, ఇళ్ళను తొలగించడంలో సహాయం చేయాలి.
- ఇళ్ళను వీలైనంత త్వరగా తిరిగి కట్టుకోవడం, మరమ్మత్తులు చేయడం ప్రారంభించాలి.

**పునర్నిర్మాణ, పునరావాస బృందం**

తుఫాను వల్ల జరిగిన నష్టం నుంచి గ్రామం కోలుకునేందుకు చేపట్టే చర్యలను ఈ బృందం పర్యవేక్షిస్తుంది. ప్రణాళిక తయారు చేయటంలో అనుభవం గల స్వయం సహాయ బృంద సభ్యులు, రైతు సంఘం సభ్యులు, ఇతర బృంద సభ్యులు ఈబృందంలో సభ్యులు కావచ్చు. గ్రామంలో పున:నిర్మాణ పనులకు ప్రభుత్వ సహాయం అందేలా చూడటం ఈ బృందం యొక్క ప్రధాన బాధ్యత.

**వీళ్ళ బాధ్యత:**

- పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్ళు, పూర్తిగా దెబ్బతిన్న ఇళ్ళు, ప్రాణనష్టానికి ప్రభుత్వం నుంచి సహాయం లభించేలా చూడాలి.
- గ్రామ పునర్నిర్మాణానికి కావలసిన సామగ్రిని గ్రామానికి చేర్చటంలో ప్రభుత్వ అధికారులకు సహకరించాలి.
- మంచి నీటి వనరులను పరీక్షించి బాగు చేసుకోవాలి.
- దెబ్బతిన్న రోడ్లు, పడిపోయిన కరెంటు స్తంభాలు, దెబ్బతిన్న రైలు మార్గాలు వంటి మౌళిక సదుపాయాలు బాగుచేయ్యటానికి ప్రభుత్వ సహాయం పొందాలి. అవి బాగు అయ్యేవరకు శ్రద్ధవహించాలి.

- ఇళ్ళ మరమ్మత్తుకు అవసరమయ్యే సామగ్రి, ఆదాయం ఇచ్చే పనులు ప్రారంభించటానికి అవసరమయ్యే సొమ్ము కుటుంబాలకు అందేలా చూడాలి. ప్రభుత్వం, బ్యాంకులు, స్వచ్ఛంద సంస్థల నుండి కావలసిన సొమ్ము పొందవచ్చును.
- ఆర్థిక కార్యక్రమాలు తిరిగి చేపట్టటానికి ఎవరికి ఏం కావాలో జాబితా తయారుచేయాలి. ఉదాహరణకు చిన్న వ్యాపారస్తులకు తిరిగి సరుకు అందాలి. చేపలు పట్టే వాళ్ళకు వాటిని అమ్ముకోటానికి మార్కెట్టు కావాలి, కొత్త ఉపాధి చేపట్టేవారికి అందుకు శిక్షణ కావాలి. (ఉదా:ఇటుకరాళ్ళ తయారీ, సిమెంటు తలుపులు, కిటికీల తయారీ, పొలాలలో చౌడు, పూడిపోయిన బోరు బావులు బాగు చేయ్యడానికి సాంకేతిక సహాయం మొదలైనవి.
- ఈ సదుపాయాలను తిరిగి ఏ విధంగా కల్పించవచ్చో గుర్తించి అందుకు కావలసిన సహాయాన్ని ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల నుండి పొందాలి.

**వ్యక్తులు, కుటుంబాల బాధ్యత:**

తుఫానుకు గురయిన గ్రామ పునఃనిర్మాణం, పునరావాస పనులు కేవలం కార్యాచరణ బృందాల ద్వారా సాధ్యంకావు. పనులలో కార్యాచరణ బృందాలకు గ్రామస్తులు సహాయ పడకపోతే అవి బాగా జరగవు.

గ్రామస్తులు స్వయంగా పునరావాసం, పునర్నిర్మాణ పనులలో పాల్గొంటే సంతృప్తి కరమైన ఫలితాలు లభిస్తాయి.

గ్రామస్తులు, కుటుంబాలతో కార్యాచరణ బృందాలు అనేకసార్లు సమావేశాలు జరిపి తుఫాను తరువాత కార్యాచరణ బృందాల పాత్ర ఏమిటో, సాధ్యమయినంత త్వరగా కోలుకోటానికి గ్రామస్తులు ఏం చేయాలో స్పష్టపరచాలి.

**కుటుంబాలు చేయగలిగిన పనులు:**

- కార్యాచరణ బృందాలకు వాళ్ళపనిలో సహాయపడటం.
- మృతకళేబరాలు తొలగించే బృందానికి అవి ఎక్కడ ఉన్నాయో తెలియ చెయ్యటం.
- సహాయం అవసరమయినవారిని గుర్తించడంలో బృందానికి సహకారం,
- కుటుంబం అంతటిని ఒక్కచోట ఉంచి జరుగుతున్న పునర్నిర్మాణ పునరావాస పనులు వారికి వివరించడం.
- సాధ్యమయితే ఇళ్ళను తిరిగి కట్టుకోవటం మొదటుపెట్టి, ఇళ్ళలోకి సాధ్యమయినంత త్వరగా తిరిగి వెళ్లాలి.
- భూమి, బ్యాంకు భీమా వంటి దస్తావేజులు దగ్గర ఉంచుకోవాలి. నష్టపరిహారం పొందటానికి ఇవి రుజువులుగా పనికొస్తాయి.
- నష్టపరిహారం కోరే ముందు తప్పిపోయిన వ్యక్తులు, పశువులు, ఆస్తుల గురించి మరొక్కసారి

విచారించాలి.

- ఇళ్ళు, జీవనోపాధుల పున:నిర్మణానికి ఏమి కావాలో తెలుసుకోవాలి. కార్యచరణ బృందాలతో వీటి గురించి చర్చించాలి.
- అవసరాలలో ఏమేరకు గ్రామంలోనే పూర్తి చేసుకోవచ్చో గుర్తించి ఆ పనులు చేపట్టాలి.
- పున:నిర్మాణ పనులకు స్వచ్ఛందంగా ముందుకు రావాలి.
- తొందరపడి పశువులు, ఆస్తులు అమ్మివేయ వద్దు. అవి ఆ తరువాత కాలంలో ఉపయోగపడవచ్చు.

**ముగింపు:**

గ్రామ అత్యవసర ప్రణాళిక తయారై, రాసుకున్న తరువాత తీసుకున్న నిర్ణయాలను గ్రామ ప్రజలందరికి తెలియ చేయాల్సిన బాధ్యత కార్యాచరణ బృందాల సభ్యులది.

ఎవరెవరు ఏం చేయాలో, ఎక్కడికి వెళ్ళాలో స్పష్టం కావడానికి తుఫానుల కాలంలో అత్యవసర ప్రణాళికను ప్రయోగంగా ఒకసారి అమలు చేసి చూడాలి.

వర్షం కురుస్తున్న ఒక రాత్రి గ్రామంలో కరెంటు తీసివేసి కార్యాచరణ ప్రణాళికను ప్రయోగాత్మకంగా అమలు చేయాలి. ఈ సమయంలో బృంద సభ్యులు వివిధ ప్రాంతాలకు వెళ్ళి కొంతమందిని, వస్తువులను రక్షిత ప్రాంతాలకు తీసుకెళ్ళాలి. ఇలా చేయ్యటం వల్ల ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటారో తెలుస్తుంది. అత్యవసర ప్రణాళికను మెరుగు పరచటానికి ఈ అనుభవాలను ఉపయోగించవచ్చును.

గ్రామంలోని మార్పులు, ఉదాహరణకు కొత్త కుటుంబాలు, జననాలు, మరణాలు, కొత్త సదుపాయాల కల్పన వంటివి పటాలలో చేర్చి ఆ మేరకు అవసరాన్ని బట్టి ఎప్పటికప్పుడు ప్రణాళిక మార్పులు చేయ్యాలి.

తుఫానుల ముప్పును ఎదుర్కోవటానికి తయారు చేసిన అత్యవసర ప్రణాళిక గ్రామంలోని ప్రతి కుటుంబానికీ, ప్రతి ఒక్కరికి తెలిసి ఉండాలి. తాము తీసుకునే చర్చలకూ అత్యవసర ప్రణాళికకూ సంబంధం తెలుసుకోవాలి.

## వ్యవసాయ గణాంకాలు

ప్రతి మాసంలోను సాగుచేసిన పైరుల వివరాలను దీర్ఘకాలపు పంటలు, తోటల క్రింద ఉన్న విస్తీర్ణాన్ని వివిధ జలాధారాల క్రింద పారుదలైన విస్తీర్ణాన్ని సర్వే/సబ్‌డివిజన్ నెంబరు వారీగా తనిఖీ చేసిన అడంగలు/పహాణిలో సంబంధిత గడువులలో నమోదు చేయాలి. ప్రతి మాసంలో కోత కోసిన పైరుల దిగుబడులను అంచనావేసి సర్వే/సబ్‌డివిజన్ నెంబరు వారీగా నమోదు చేయాలి. సంవత్సరాంతమున భూమి వినియోగ వివరాలను 9 భాగాల క్రింద వర్గీకరించి వ్రాయాలి. అడంగల్/పహాణీ గడులు నింపేందుకు సూచనలు జతపచడమైనది.

అడంగల్/పహాణీలో నమోదు చేసిన పంటల వివరాల ఆధారంగా గ్రామమునకు పైరువారీ సాగు మరియు పారుదల విస్తీర్ణాన్ని ప్రతి మాసానికి మరియు ఆ మాసాంతం వరకు మాసవారీ లెక్క తయారు చేయాలి. ఈ మాసవారీ లెక్కలో ఆ నెలాఖరు వరకు కోత కోయబడిన వివిధ పైరుల విస్తీర్ణం, దిగుబడి అంచనా తరగతులలో విభజించి గడులలో వ్రాయాలి. ఆ నెలాఖరుకు మొత్తం సాగైన విస్తీర్ణంలో మొదటి పంట మరియు రెండవ పంట విస్తీర్ణం కూడా చూపాలి. ఈ మాసవారి లెక్క మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టరు ద్వారా తహశీల్దారు గారికి నెలాఖరుకు పంపాలి.

ప్రతి సంవత్సరం ఖరీఫ్/రబీ సీజనులో అర్థగణాంక శాఖ వారు వ్యవసాయ గణన నిర్వహిస్తారు. ఈ వ్యవసాయ గణనను నిర్దేశించిన గ్రామ గోష్వారాలో పంటల వారీ విస్తీర్ణం, జాలాధారం క్రింద పారుదలైన విస్తీర్ణం మరియు పైరుల వారీ, జలాధారాల వారీ పారుదల విస్తీర్ణం, జలాధారాల సంఖ్య, భూమి వినియోగ వివరాలను తెలియజేయాలి. ఈ గ్రామ గోష్వారాలను నిర్ణీత తేదీలలో ఖరీఫ్/రబీ సీజన్‌లకు తహశీల్దారు గారికి పంపాలి.

ప్రతి మాసానికి వర్షపాత వివరాలు, జలాధారంలో నీటి నిల్వలు, నాటిన పైరులకు ఆ నీరు ఎన్ని రోజులకు సరఫరా అవుతుంది. పంటల పరిస్థితి మొదలైన వివరాలతో తయారుచేసిన వాతావరణ పంటల పరిస్తితిపై నివేదికను తహశీల్దారు గారి కార్యాలయానికి పంపాలి.

సకాలంలో పైర్ల విస్తీర్ణం, ఉత్పత్తులను, అంచనా వేసేందుకు భారత ప్రభుత్వం వారు నిర్ణీత కాలంలో పంటల అంచనా నివేధిక పథకం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమలు చేయుచున్నారు. ఈ పథకం క్రింద ఎంపిక చేసిన గ్రామాలలో పంటల విస్తీర్ణాన్ని సకాలంలో నమోదు చేసి నిర్ణయించిన కార్డుల ద్వారా విస్తీర్ణ వివరాలను నిర్ణీత తేదీలో అర్థగణాంక శాఖ వారికి పంపవలసి ఉన్నది. కానీ ఎంపిక చేసిన గ్రామాలలో పైరులు సాగుచేసిన వెంటనే పొలాలను సందర్శించి విస్తీర్ణాన్ని అడంగలు/పహాణీలో నమోదు చేయాలి. వీటి ఆధారంగా పైరు వారీ విస్తీర్ణం వివరాలను కార్డుల ద్వారా అర్థగణాంక శాఖ వారికి పంపాలి.

ప్రకృతి వైపరీత్యాలు అంటే అనావృష్టి, వరదలు, తుఫాను, వడగండ్లు మొదలగునవి సంభవించినపుడు జరిగిన నష్టం వివరాలను అంచనా వేయవలసి ఉన్నది. ముఖ్యంగా పైరుల విస్తీర్ణంలో తగ్గుదల మొదలగునవి అంచనా వేసి ప్రత్యేక నివేధికను పంపాలి. దిగుబడి వివరాలను అంచనా వేసేందుకు ప్రత్యేకంగా పంట కోత ప్రయోగాలను నిర్వహించాలి.

పంటల ఉత్పత్తిని అంచనా వేసేందుకు అర్థగణాంక శాఖ ఆధ్వర్యంలో ప్రధాన పంటలపై పంటకోత ప్రయోగాలు జరుపబడుచున్నవి. ఈ పంటకోత ప్రయోగాల ఫలితాలను పంటల భీమా పథకం అమలులో ఉపయోగిస్తున్నారు. కావున ఎంపిక చేసిన గ్రామాలన్నిటిలోను పంటకోత ప్రయోగాలు సక్రమంగా నిర్వహించేందుకు గ్రామ రెవెన్యూ అధికారి సర్వే నెంబరు/క్షేత్రములను సక్రమంగా తెలియపరచడంలోను, ఈ ప్రయోగాలను నిర్వహించేందుకు రైతుల సహకారం చేకూరుటలోను, గ్రామ రెవెన్యూ అధికారి గణాంకులకు తోడ్పడాలి. అంతేకాక, ఒక పర్యాయంలో కాకుండా వివిధ కాలాలలో కోతకు/తీతకు వచ్చే పంటలకు అంటే, ప్రత్తి, ఆముదం, పొగాకు, మిరప మొదలగు పంటలపై ప్రయోగాలను గ్రామ రెవెన్యూ అధికారి నిర్వహించవలసి యున్నది. మరియు ఈ ప్రయోగాలు నిర్వహించేందుకు గ్రామానికి వచ్చిన వ్యవసాయ శాఖ, రాష్ట్ర గణాంక శాఖ జాతీయ నమూనా సంస్థ (ఎన్.ఎస్.ఎస్). అధికారులకు గ్రామ రికార్డులు అందజేసి వారు ప్రయోగాలను సక్రమంగా నిర్వహించేదుకు తోడ్పడవలసియున్నది.

# ఆంధ్రప్రదేశ్ (షెడ్యూల్డు కులముల, షెడ్యూల్డు తెగల మరియు (వెనుకబడిన తరగతుల) కుల ధృవీకరణ పత్రముజారీ విధాన చట్టం 1993

(చట్టం 16/1993)

## 1. ముఖ్య ఉద్దేశ్యము:

ప్రభుత్వ ఉద్యోగములు పొందుటకు, విద్యా సంస్థలలో ప్రవేశము పొందుటకు, షెడ్యూలు కులములు, షెడ్యూలు తెగలకు, వెనుకబడిన తరగతుల వారికి రిజర్వు చేసిన స్థానములో అట్టి కులమునకు చెందని వ్యక్తులు, తప్పుడు సర్టిఫికేట్లు పొంది ఉద్యోగములు పొందడం, లేదా విద్యా సంస్థలలో ప్రవేశం పొందడం అదే విధంగా పై కులాల వారి ప్రభుత్వము ప్రభుత్వాధీన సంస్థలు కల్పించే ఆర్థిక సహాయము, సౌకర్యములు కూడ పొందుచున్నందువల్ల, అట్టి దుశ్చర్యలు అరికట్టి, అట్టి వారిపై కఠినముగా చర్య తీసుకొనుటకు, వాస్తవమైన షెడ్యూలు కులముల, షెడ్యూలు తెగల, వెనుకబడిన తరగతుల వారికి అన్యాయం జరగకుండ రక్షణ కల్పించే ఉద్దేశంతో ఈ చట్టం రూపొందించబడినది. ఈ చట్టం 15-05-1997 నుండి అమలులోనికి వచ్చినది.

## 2. ధృవీకరణ పత్రం జారి చేయుటకు విధానము:

సెక్షన్ 3 ప్రకారం షెడ్యూలు కులముల, షెడ్యూలు తెగల, వెనుకబడిన తరగతుల వారు కుల, నివాస, జనన ధృవీకరణ పత్రం (Integrated Community certificate) కొరకు రూలు- 5 అనుసరించి ఫారం 1 లో షెడ్యూలు జాతుల వారు, ఫారం 2 లో షెడ్యూలు కులములు మరియు వెనుకబడిన తరగతుల వారు తహశీల్దారు గారికి దరఖాస్తు చేస్తూ, కులము, నివాసము, జనన తేదీలను రుజువు పర్చే సాక్ష్య పత్రములను జతచేయాలి. (స్కూలు సర్టిఫికేట్లు, జనన రిజిస్టరు నకలు, మొదలగునవి) దరఖాస్తు పై అవసరమైన దర్యాప్తు నిర్వహించుటకు తగు సమయం ఉండేలాగున చాలా ముందుగానే (6 నెలల ముందుగా (రూలు-4)) దరఖాస్తు చేయాలి.

రూలు 5 ప్రకారం తహశీల్దారు గారు అట్టి దరఖాస్తుపై సమగ్ర విచారణ జరిపి, తాను సాక్ష్య పత్రముల వివరములు సరియైనవని, భావించినచో 30 రోజులలోగా ఫారం 3 లో కుల, నివాస మరియు జనన తేదీ ధృవీకరణ పత్రాన్ని జారీ చేయాలి. (సెక్షన్-4) దరఖాస్తు తో జతపర్చిన సాక్ష్య పత్రములలో గల వివరములు సరిపోనిచో, కావలసిన అదనపు సాక్ష్యాధారములు కోరుచూ దరఖాస్తుదారునకు అతడు మైనరైనచో తండ్రి లేక సంరక్షకునికి ఫారం 4 నోటీసు జారీ చేసి, అదనపు సాక్ష్యాధారములను పొంది, కుల, నివాస జననతేదీలు రుజువైనచో ఫారం 3 లో ధృవ పత్రాన్ని 60 రోజులు లోపల మంజూరు చేయాలి.

సమగ్ర దర్యాప్తు చేసిన పిదప, తహశీల్దారు దరఖాస్తు దారు తనకులము, నివాసము లేదా జనన తేదీ రుజువు చేసుకోనట్లైతే, తిరస్కరిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలి.

ఐతే అనుమానాస్పద, వివాదభరితమైన కేసులను తహశీల్దారు జిల్లాస్థాయి స్క్రూటినీ కమిటీకి (జాయింటు కలెక్టరుకు) నివేదించి, అదేశాలు కోరాలి. రూ5-(1).

రూలు 6 ప్రకారము - కులము, నివాసము, జనన తేదీలను ఋజువు పర్చుకో వలసిన బాధ్యత దరఖాస్తు దారునిదే (సెక్షన్ - 6).

**3.అప్పీలు విధానం:**

సెక్షన్ 7 ప్రకారము: తహశీల్దారు గారికి ఉత్తర్వుపై 30 రోజులోగా సంతృప్తి చెందని వ్యక్తి జిల్లా కలెక్టరు వార్కి అప్పీలు చేసుకొవచ్చు. కలెక్టరు వారు అప్పీలు దారు వాదనను పరిశీలించిన పిదప, తహశీల్దారు వారి ఉత్తర్వులను త్రోసి పుచ్చవచ్చును. లేదా ఖాయపర్చవచ్చును. జిల్లా కలెక్టరు వారి ఉత్తర్వులు స్టేటు గెజిట్‌లో ప్రచురించిన 30 రోజుల లోగా ప్రభుత్వానికి అప్పీలు చేసుకోవచ్చు, ప్రభుత్వమువారు అప్పీలుదారు వాదనను పరిశీలించిన పిదప, కలెక్టరు వారి ఉత్తర్వును త్రోసి పుచ్చవచ్చు లేదా ఖాయపర్చవచ్చును. ఈ విషయములో ప్రభుత్వమునకు రెవ్యూ చేయు అధికారముకలదు, అధికారులు యిచ్చిన ఉత్తర్వులు నిలుపుదల చేయు అధికారముకలదు.

**4.తప్పుడు కుల ధృవీకరణ పత్రాలు పొందిన వారిపై చర్యలు:**

సెక్షన్ 11 ప్రకారం తప్పుడు కులధృవీకరణ పత్రం ఆధారంగా షెడ్యూలు కులము, షెడ్యూలు తెగ, లేదా వెనుకబడిన తరగతులకు చెందని వ్యక్తి ఆకులములకు నిర్దేశించిన (రిజర్వుచేసిన) ఉద్యోగము పొందినా, విద్యా సంస్థలలో ప్రవేశము పొందినా, లేదా ఆర్థిక సహాయము లేదా సౌకర్యములు పొందినా, అట్టి తప్పుడు సర్టిఫికెట్టు రద్దు పరచిన వెంటనే ఉద్యోగం నుండి తప్పించడం విద్యా సంస్థల నుండి (డిబార్) తొలగించడుటయేగాక, ఆర్థిక సహాయము లేదా సౌకర్యములు నిలుపుదల చేయడం, పొందిన ఆర్థిక సహాయాన్ని, సౌకర్యాలను వెనుకకు తీసుకొనడం (Withdraw చేయడం) జరుగుతాయి. డిగ్రీ, డిప్లమా పట్టాలు రద్దు కాబడతాయి.

సెక్షన్ 11,12,13 మరియు 14 సెక్షన్ల ప్రకారం: తప్పుడు కుల ధృవీకరణ పత్రములతో ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థలు, స్థానిక సంస్థలు, విద్యా సంస్థలలో లబ్ది పొందే యీదిగు వారికి (తప్పుడు కుల ధృవీకరణ పత్రం రద్దు చేసిన పిదప) 6 మాసములకు తక్కువ కాకుండా 2 సంవత్సరముల కాలము వరకు కారాగార శిక్ష మరియు రూ. 1,000/–లుకు తక్కువ కాకుండా రూ. 5,000/–లు వరకు జరిమానా విధించ వచ్చును.

షెడ్యూలు కులము, షెడ్యూలు తెగ, వెనుకబడిన తరగతుల వార్కి రిజర్వు కాబడిన 1)సదుపాయము పొందిన సందర్భములో 2) ఉద్యోగమును పొందిన సందర్భములో 3) ఎన్నుకొనబడడానికి వినియోగించిన సందర్భములో 4) గిరిజనునికి రిజర్వు కాబడిన (లేదా నిర్దేశించిన) ఆ సదుపాయములను గిరిజనేతరులు తప్పుడు కుల (ట్రైబ్) ధృవీకరణ పత్రంలో అనుభవించుచున్న సందర్భములో పై న తెల్పిన శిక్షకు పాత్రుడౌతారు.

అదే విధంగా ఉద్దేశ పూర్వకంగా తప్పుడు కుల ధృవీకరణ పత్రం యిచ్చిన కాంపిటెంటు అధారిటీ (తహశీల్దారు) మరియు ప్రోత్సహించిన వ్యక్తి కూడ పైన తెలిపిన శిక్షకు పాత్రులగుదురు.

రూల్ 15 ప్రకారము పైన తెల్పిన నేరాల విషయంలో జిల్లా కలెక్టరు వారు మొదటి తరగతి జ్యుడిషియల్ మెజిస్ట్రేటు కోర్టులో కేసులు దాఖలు చేయుటకు చర్యతీసుకోవాలి.

చట్టపరిధిలో యిచ్చిన ఉత్తర్వులను ప్రశ్నించు అధికారము సివిలుకోర్టులకు లేదు.

ఈ చట్టములోని నిబంధనలు ఉల్లంఘించి నేరాలు చేసిన వారిని వారెంటు లేకుండా అరెస్టు చేయవచ్చును.

ధృవీకరణ పత్రము నమూన జతచేయడమైనది.

**TAHASILDAR'S OFFICE - ....................**
**................DISTRICT, A.P - 522002**

Certificate No. Date: - -2006

## COMMUNITY, NATIVITY AND DATE OF BIRTH CERTIFICATE

1. This is to certify that Sri/Smt/Kum.................................................................................................. Son / Daughter of Sri.............................................................of Village/Town D.No....................................................Mandal Guntur District Guntur of the State of Andhra Pradesh belongs to.........................................Community which is recognized as..............................under

   The Constitution (Scheduled Caste) Order 1950
   The Constitution (Scheduled Tribes) Order 1950

   G.O.Ms.No.1793, Education, dated 25-9-1970 as amended from time to time (B.Cs)S.Cs, S.Ts, list (Modification) Order, 1956 S.Cs and S.Ts (Amendment) Act, 1976.

2. It is certifies that Sri/Smt/Kum.......................................................................................... is a native of D.No.......................................................................................Village/Town ........... Mandal ......... District of Andhra Pradesh.

3. It is certified that the place of birth of Sri/Smt/Kum...................................................................... is ............ Village/Town .............. Mandal .............. District of Andhra Pradesh.

4. It is certified that the date of birth of Sri/Smt/Kum........................................................................... is Day <<Day>> Month <<month>> Year <<year>> (in words)

   as per declaration given by his/her father/mother/guardian and as entered in the school records where he / she studied.

Signature :
Date :
Name :
Designation :

## ఆదాయ సర్టిఫికెట్

## (INCOME CERTIFICATE)

పేదలకు, దారిద్ర్య రేఖ దిగువనున్న కుటుంబాలకు ఉద్దేశించిన రాయితీలు పొందటానికి ఆదాయ ధృవీకరణ పత్రము అవసరమవుతుంది. వేలం పాటల్లో, బ్యాంకుల నుండి పెద్ద మొత్తములో లోన్లు తీసుకునే వారికి తమ అర్హత నిరూపించుకోవటానికి, కాంట్రాక్టర్లకు అప్పులు తీర్చే శక్తి (సాల్వేన్సీ) ఉన్నదనే సర్టిఫికెట్ కూడా కొన్ని సందర్భాలలో అవసరమవుతుంది.

**ఆదాయ సిర్టిఫికెట్ ఎప్పుడు, ఎలా అవసరపడుతుంది!**

- రేషన్ కార్డు (తెలుపు రంగు) పొందగోరే వారికి
- వివిధ సంక్షేమ పథకాల ద్వారా సబ్సిడీ పొందే వారికి (డ్వాక్రా, డి.ఆర్.డి.ఏ., వ్యక్తిగత మరుగుదొడ్ల పథకం, ఆదరణ, ముందడుగు తదితరములు ద్వారా లబ్ధిపొందుటకు)
- ఇళ్ళ స్థలాల కేటాయింపు
- బ్యాంకు ఋణములు
- బలహీన వర్గాల వారికి గృహ వసతి
- వృద్యాప్య పింఛనులు
- కుటుంబ ప్రయోజన పథకములు
- విద్యార్థి స్కాలర్‌షిప్‌లు మంజూరుకు

ఆదాయం ధృవీకరణ పత్రాలు ఆదాయం పన్ను విషయంలో ఉపయోగించటానికి వీలు లేదు. సర్టిఫికెట్ మంజూరు చేసే సమయంలో గ్రామ రెవెన్యూ అధికారి అన్ని రకాలుగా వచ్చే ఆదాయాన్ని పరిగణించాలి. వనరులు, ఆదాయమూలాలు ఈక్రింది విధముగా ఉండేటట్లు చూచి రికమండ్ చేయవలెను.

- భూమి, వ్యాపారం, శ్రమ కూలీ
- ఉద్యోగం, భవనాలు (అద్దెలు), ఇతర వనర్లు, వృత్తి

రేషన్ కార్డులు, సబ్సిడీలు, ఇళ్ళ స్థలాల కేటాయింపులు పొందటం కోసం తరచుగా ఆదాయం సిర్టిఫికెట్‌ను ఉపయోగించటం జరుగుతుంది. ముఖ్యంగా పేదవారికై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలు రూపొందించి ఆదాయ ధృవీకరణ పత్రము వారికి అమలుకై వెంటనే చర్యలు తీసుకొని ఇవ్వవలెను. అనర్హులైన వ్యక్తులు పొందే అలవాటును గట్టిగా ఖండించాలి. అలాంటి చర్యలకు పాల్పడే వ్యక్తులను నివారించేటట్లు చూడవలెను.

**ఆదాయ ధృవీకరణ పత్రం పొందటం ఎలా?**

- సంబంధిత తహశీల్దారు గారికి దరఖాస్తు చేసుకొనవలెను.
- దరఖాస్తునందు సరైన సమాచారముతో పూర్తి చేయవలెను. రెండు రూపాయల కోర్టు ఫీజు స్టాంపు అంటించవలెను.
- దరఖాస్తు ఫారము కార్యాలయమునకు అందజేసిన అనంతరము తహశీల్దారు గారు సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారి అదాయము పొందు పరచి సర్టిఫై చేసిన పిదప తహశీల్దారు గారి సంతకముతో సంబంధిత లబ్ధిదారులకు అందజేయబడును.

## నివాస ధృవీకరణ సర్టిఫికెట్

## (RESIDENCE CERTIFICATE)

ఒక గ్రామము లేక పట్టణం లేదా ఒక వార్డులో మీ యొక్క శాశ్వత నివాసమును ఋజువు చేసేదే నివాస ధృవీకరణ పత్రము. ఒక ప్రదేశములో మీరు నివాసమున్న కాలాన్ని బట్టిగాని, శాశ్వతమైన ఉద్యోగమునుట్టిగానీ ఈ సర్టిఫెకెట్ జారీ చేయబడును.

**సర్టిఫెకెట్ ఎప్పుడు అవసర పడుతుంది?**

- ☞ పాఠశాలలనందుగానీ, కళాశాలలనందు గానీ ప్రవేశము పొందే సమయములో
- ☞ ప్రభుత్వ ఉద్యోగము / ప్రభుత్వ సంస్థలందు ఉద్యోగము లో చేరునప్పుడు
- ☞ రేషన్ కార్డులు పొందునప్పుడు
- ☞ వివిధ సబ్సిడీ పథకాలు పొందగోరే సమయములో
- ☞ బ్యాంకుల ద్వారా ఋణ సదుపాయాలు పొందగోరే సమయములో

**నివాస ధృవీకరణ పత్రం పొందటం ఎలా?**

- ☞ తహశీల్దారు గారికి దరఖాస్తు చేసుకొనవలను. (నిర్దేశించిన ఫారమ్‌లో)
- ☞ రెండు రూపాయల కోర్టు ఫీజు స్టాంపును ధరఖాస్తు ఫారమ్ పైన అంటించాలి. (ఎస్.సి., ఎస్.టి, వారికి దీని నుండి మినహాయింపు ఉంది)
- ☞ గత నాలుగేళ్లలో వీరు చదివిన పాఠశాల, కళాశాలలో చదివిన సిర్టిఫికెట్ కావలెను.
- ☞ కళాశాల లేక పాఠశాలల్లో ఇచ్చిన బదిలీ సిర్టిఫికెట్ (టి.సి.) ఉండవలెను.
- ☞ రేషన్ కార్డు కాపీ (ఒకవేళ కార్డు లేని పక్షంలో నివాసాన్ని ధృవపరిచే డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్, పంచాయితీ పన్ను కాపీలు జతపరచవలెను.

గ్రామ రెవెన్యూ అధికారి ఎంక్వైరీ నిర్వహించి మంజూరు చేయుటకు త్వరితగతిన చర్యలు తీసుకుందురు

# షెడ్యూల్డు జాతులు, తెగలపై అత్యాచార నిరోధక చట్టము - 1989

షెడ్యూలు జాతులు, తెగలు, ఆర్థిక విద్యారంగాలలో సమాన అవకాశాలను పొందుటకు, వారికి సామాజిక న్యాయము చేకూర్చుటకు, ధనికి వర్గాలవారి అత్యాచారాల నుండి రక్షించుటకు ఏర్పాటు చేయబడిన చట్టమే, షెడ్యూల్డ్ జాతుల, తెగల అత్యాచార నిరోధక చట్టము. ఇతర వ్యక్తులు, షెడ్యూల్డ్ కులములు, తెగలకు చెందిన వారి న్యాయపరమైన హక్కులకు భంగం కలిగించుట, వారిని అసత్యపు నేరారోపణల ద్వారా దావాలలో ఇరికించుట – వారి సార్వజనిక హక్కులను భంగము కలిగించునవి ఈ చట్టము క్రింద నేరములుగా పరిగణించబడతాయి. షెడ్యూడ్డ్ తెగలు కులములకు చెందిన వారిని అంటరాని వారుగా పరిగణించుట, అవమానించే ఉద్దేశ్యంతో కులం పేరున దూషించుట ఈ చట్టం ప్రకారం శిక్షార్హములు.

షెడ్యూల్డ్ కులములు లేదా తెగలకు చెందని వ్యక్తి ఈ క్రింది చర్యలు జరిపినచో అవి నేరములుగా లేదా అత్యాచారములుగా పరిగణించబడును. (సెక్షను – 3)

1. తినరాని పదార్థములు తినమని వారిని బలవంత పెట్టుట.
2. అవమాన పరచు ఉద్దేశ్యముతో చెత్త పదార్థములు, శవములు, చెడు పదార్థములు మొదలగునవి వారి స్థలములో బలవంతంగా వేయుట.
3. వారికి చెందిన భూములను అన్యాయంగా ఆక్రమించుట లేదా సాగు చేయుట లేదా బలవంతగా బదిలీ చేయుట. అన్యాయంగా వారి స్థలములు, / భూముల నుండి ఖాళీ చేయించుట.
4. యాచకము లేదా వెట్టి చాకిరి చేయమని బలవంత పెట్టుట.
5. ఓటు వేయకుండా అడ్డుపడుట వంటి చర్యలు
6. వారిపై తప్పుడు కేసులు బనాయించుట.
7. ప్రభుత్వ ఉద్యోగులకు తప్పుడు సమాచారమిచ్చి వారి ద్వారా షెడ్యూల్డ్ కులము లేదా తెగకు చెందిన వారికి నష్టము కలిగించుట.
8. షెడ్యూల్డ్ కులము లేదా తెగకు చెందిన స్త్రీ ని అగౌరవ పరుచుట, బలత్కారము చేయుట.

పై నేరములు చేసిన వారికి ఆరు నెలల నుండి ఐదు సంవత్సరముల వరకు శిక్ష మరియు జరిమానా విధించచ్చును.

వారి ఆస్తులకు నష్టం కలిగించిన నేరస్థులకు ఆరు నెలల నుండి ఏడు సంవత్సరముల వరకు శిక్ష విధించవచ్చును.

సూచన: ఈ చట్టము క్రిందకి నేరములను విచారించుటకు ఏర్పాటైన ప్రత్యేక కోర్టుల చిరునామా.

1. స్పెషల్ జడ్జ్ ఫర్ ట్రయిల్ ఆఫ్ అఫెన్సెస్ అండర్ ది యస్.సి/ యస్.టి (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్) చట్టం 1989

జిల్లా కోర్టు భవనములు

(ప్రతి జిల్లాలోను నెలకొల్పబడినాయి.)

## వెట్టిచాకిరి నిర్మూలన చట్టం - 1976

Bonded Labour System - (Abolition) - Act 1976

ఇది వెట్టిచాకిరి రద్దు, నిరోధానికి సంబంధించినది. దేశమంతా ఈ చట్టము తేది: 25.10.1975ది నుండి అమలులోనికి వచ్చింది. ఈ విషయాన్ని సంబంధించి అంతకుక్రితం వెట్టిచాకిరిపై ఉన్న అన్ని చట్టాలు ఈ చట్టానికి లోబడి, అమలు జరుపబడతాయి. వెట్టిచాకిరిని, దానికి సంబంధించిన బాండు, అప్పు ఈ చట్టం ద్వారా రద్దుచేయబడ్డాయి. వెట్టిచాకిరిని చట్టవ్యతిరేక కార్యకలాపంగా పరిగణించారు. ఈ చట్టం పరిధిలో రెవెన్యూ డివిజనల్ అధికారికి, తహశీల్దారు గారికి – కేసులను విచారించుటకు అధికారాలు సంక్రమించాయి.

వెట్టిచాకిరికి సంబంధించిన కేసులను మూడుతరగతులలో విశ్లేషించవచ్చు.

మొదటిది – వెట్టిచాకిరి గుర్తింపు – ఇది సర్వే ద్వారా చేయవచ్చు.

రెండవది – వెట్టిచాకిరికి సంబంధించిన అన్ని పత్రాలను స్వాధీనంచేసుకొని – భూస్వామిని ప్రాసిక్యూట్‌చేస్తూ, సంబంధిత వ్యక్తిని వెట్టి నుండి విముక్తిచేయుట.

మూడు – వెట్టిచాకిరి నుండి విముక్తి పొందిన వ్యక్తికి పునరావాసం కలుగచేయుట.

గ్రామీణాక్షేత్రాలలో పని చేసే అధికారులు సర్వే ద్వారా వెట్టి చాకిరికి సంబంధించిన విషయాలను సేకరించాలి.

## ఆంధ్రప్రదేశ్ ఋణ విముక్తి చట్టం 1977

(A.P.Agricultural Indebtedness Relief Act.1977)

వ్యవసాయ రంగంలో ఉండే వారికి అప్పుచేయాల్సి రావడం సర్వసాధారణ విషయం భారతదేశంలోని వ్యవసాయదారుడు – అప్పులలో పుట్టి, అప్పులలో పెరిగి అప్పులనే తన సంతతికి సంక్రమింపచేస్తాడు. అనేది పాతకాలపునానుడి, అందుచే వ్యవసాయ కూలీలకు సన్నకారు, చిన్నకారు రైతులకు, గ్రామాలలోని చేతి పనివారికి, అప్పుల బాధ నుండి విముక్తి కలిగించే ఉద్దేశ్యతో ఆంధ్రప్రదేశ్‌లో A.P.Agricultural Indebtedness Relief Act. అను ఒక చట్టాన్ని 1977 లో రూపొందించారు. అప్పిచ్చిన వారు పెట్టే బాధల నుండి ఉపశమనం కలిగించడమే ఆ చట్టం ప్రధాన లక్ష్యం–చిన్నకారు, సన్నకారు రైతులు, గ్రామీణ చేతి పనివారు, వ్యవసాయ కూలీలు తాము చెల్లించాల్సిన అసలు, అందుపై వడ్డీలను, సెక్షన్ 4 ప్రకారం మాఫీచేశారు. అంటే ఆ అప్పులు – వడ్డీలను, చెల్లించినట్లే పరిగణింపబడతాయి. తనఖా పెట్టిన ఆస్తికూడా, విముక్తి పొంది, మరల స్వంతదారుడికి చేరుతుంది. ఈ చట్టంలోని లక్ష్యాలను నెరవేర్చేందుకు తహశీల్దారు గారికి అవసరమైన అన్ని అధికారాలను బాధ్యతలను అప్పగించారు.